క్లుప్తంగా

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లిలోని మహమ్మాయి దేవీ ఆలయ బ్రహ్మోత్సవాలకు సిద్ధమయ్యింది. మంగళ్‌పల్లిలో పులందరి వాగు పక్కనే అహ్లాదకరమైన వాతవరణంలో వేడుకలు జరగనున్నాయి. నేటి నుంచి వారం రోజుల పాటు వేడుకలు జరగనున్నాయి.3న ధ్వజారోహణం, 4న కల్యాణోత్సవం, 5న రథోత్సవం, 6న త్రిశూలత్సవం, 7న చక్రస్నానం నిర్వహిస్తారు. ప్రతిరోజు రుద్రాభిషేకం, మహానైవేద్యం, అర్చనలు, హారతులు, ఆరాధన కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వహకులు తెలిపారు. పోలకంపల్లి లక్ష్మీ నర్సింహ భజన మండలి ఆధ్వర్యంలో లవకుశ వీధి నాటకం ప్రదర్శిస్తారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

సింగంపల్లి, విఠాయిపల్లిలో పంటల పరిశీలన

ఆమనగల్లు: ఆమనగల్లు మండల పరిధిలోని సింగంపల్లి, విఠాయిపల్లి గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయాధికారి అరుణకుమారి, ఏఈఓ శివతేజ ఆధ్వర్యంలో రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. వేరుశనగ, ఆముదం, మామిడితోటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వేరుశనగలో తొలిపూత సమయంలో జిప్సంను ఎకరానికి 200 కిలోలు వేసుకోవాలని అరుణకుమారి సూచించారు. వరిపంటలో కాండం తొలచు పురుగు నివారణకు ఫటేరా గులికలు ఎకరాకు 6కిలోలు వేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు శ్రీనివాస్, బాల్‌రాం, మల్లయ్య, పాండయ్య, మల్లయ్య, సేవ్య, మంగ్య, అంజమ్మ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

తలకొండపల్లి: పేదల ఆరోగ్యమే లక్ష్యంగా టీఆర్‌ఎస్ సర్కార్ పనిచేస్తోందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఖానాపూర్‌కు చెందిన సునీతకు రూ.12,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ.. బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సర్దార్‌నాయక్, నోడల్ ఆఫీసర్ జంగయ్య, బాల్‌రాజ్, సర్పంచ్ విఠలయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఆలయానికి మైక్‌సెట్ అందజేత



మైక్‌సెట్ అందజేస్తున్న దాత

కడ్తాల్: సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయానికి రూ.50 వేల విలువ గల మైక్‌సెట్‌ను అందజేశారు. గురువారం ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులకు సౌండ్‌సిస్టమ్‌ను ఆయన అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఆలయ అర్చకులు కోరారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మైక్‌సెట్‌ను విరాళంగా అందజేసిన లక్ష్మీనర్సింహరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్ రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు రాములుయాదవ్, నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేనుగోపాల్, శ్రీధర్ పంతులు, పవన్‌కల్యాన్, ఆంజనేయులు ఉన్నారు.

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన

యాచారం: గునుగల్ మెట్ట వ్యవసాయ పరిశోధన క్షేత్రం ఎదుట ఒప్పంద కార్మికులు చేపట్టిన ఆందోళన కార్యక్రమం గురువారానికి మూడోరోజుకు చేరింది. 20 ఏళ్లుగా క్షేత్రంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రతి శనివారం సెలవు దినంగా ప్రకటిస్తూ కంపెనీ యాజమాన్యం తాజాగా నిర్ణయం తీసుకుంది. 20 ఏళ్లుగా లేనిది ప్రస్తుతం ఎందుకు ప్రతి శనివారం సెలవు దినంగా ప్రకటిస్తున్నారని కార్మికులు మండిపడుతున్నారు. గతంలో మాదిరిగానే ఆదివారం మాత్రమే సెలవు దినంగా ప్రకటించి నెలకు 26 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలో పునర్నిర్మిస్తున్న శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం నిర్మాణానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయ నిర్మాణానికిపలువురు విరాళాలు అందించారు. ఆలయం ఆవరణలో గురువారం గ్రామసర్పంచ్ బట్టు అనురాధ, ఎంపీటీసీ బట్టు కిషన్‌రెడ్డికి పలువురు విరాళాలు అందించారు. నర్సింహగౌడ్, అంతమ్మ జ్ఞాపకార్థం మల్లయ్య, సుమతమ్మ, శ్రీనివాసు కలిసి రూ.లక్ష, చంద్రారెడ్డి, నర్సమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు గోపిడి వెంకట్‌రెడ్డి రూ.50 వేలు, వడ్డెపల్లి పర్వతాలు, హేమలత దంపతులు రూ.21 వేలు, పంజుగుల రాజేందర్, లక్ష్మమ్మ దంపతులు రూ.21 వేలు, కాసుల వెంకటేశ్ రూ.51వేలు విరాళం అందించారు. స్థానికులు యాదయ్య, జగతయ్య, జంగయ్య, శేఖర్, నర్సిరెడ్డి, పర్వతాలు, వెంకన్న, బాలరాజుగౌడ్, మాధవరెడ్డి, విజేందర్‌రెడ్డి, పులెమల్ల బుచ్చయ్య, పాండు, లక్ష్మయ్య, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువును సుందరీకరిస్తాం

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



హయత్‌నగర్: రాయన్ చెరువులో కలుస్తున్న మురుగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

హయత్‌నగర్: గ్రేటర్ పరిధి నుంచి వచ్చే మురుగు నీటి కారణంగా పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని పస్మాముల రాయన్‌చెరువు మురుగు నీటితో నిండిపోయిందని ఈ మురుగు నీటినీ మూసీనది వరకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. పస్మాముల చెరువులోని మురుగు నీటి కారణంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామస్తులు ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వారికి ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే మంచిరెడ్డి గురువారం చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎల్‌బీనగర్ పరిధి నుంచి వచ్చే డ్రైనేజీ నీరు గతంలో కుంట్లూర్ చెరువులోకి వచ్చేవని.. రూ.14 కోట్ల వ్యయంతో అక్కడి నుంచి మురుగు నీటిని తరలించామని తెలిపారు. అక్కడినుంచి వచ్చే మురుగు నీరు రాయన్ చెరువులోకి వస్తుందని అన్నారు. మురుగు చేరడంతో దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎంతోకాలంగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఇందుకు ఎస్‌ఎన్‌డీపీ కింద రూ.32 కోట్లతో పైపులైన్ వేస్తామని అవసరమైతే తాను కూడా కొన్ని నిధులు ఇస్తానని ఆయన తెలిపారు. రాయన్ చెరువులో పూడిక తీసి సుందరీకరణ పనులు చేపడగామని అన్నారు. మురుగు నీటిని తారామతిపేట్, గౌరెల్లి నుంచి మూసీ వరకు తరలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌ఈ హైదర్‌ఖాన్, ఈఈ బన్సీలాల్, డీఈ ఉషారాణి, ఏఈ నికేష్, ఎస్‌ఎన్‌డీపీ అధికారులు కృష్ణయ్య, ప్రసాద్, మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, డీఈ అశోక్‌కుమార్, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, హరిశంకర్, నాయకులు జైపాల్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, రాజుగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల సాధికారతకే దళితబంధు

తలకొండపల్లి: దళితుల సాధికారత కోసయే దళిత బంధు పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని మెదక్‌పల్లికి చెందిన దర్వ్యల గణేష్‌కు దళిత బంధు పథకం కింద కారు మంజూరైంది. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే ఆయన నివాసంలో లబ్ధిదారునికి కారును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దళితబంధు ద్వారా దళితులు ఆర్థిక ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, జిలా జర్నలిస్టు నాయకుడు శంకర్, ఓరుగంటి వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌లు ధరణి, శివశంకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ భాస్కరరావు, గణేశ్, మహేశ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: దళితబంధు లబ్ధిదారుడికి కారు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

‘సర్వ్’ సేవలు అభినందనీయం

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న దశరథ్‌నాయక్, అతిథులు

కడ్తాల్: దివ్యాంగుల పునరావాసానికి, వారి సంక్షేమానికి సర్వ్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సర్వ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 8 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, ఒక జత సోల్డర్ క్రచర్, నోట్‌బుక్స్, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సక్కుబాయి, సర్వ్ సంస్థ డైరెక్టర్ అనిల్‌కుమార్‌గౌడ్, సంస్థ అధ్యక్షురాలు మీనాక్షి, డిప్యూటీ తహసీల్దార్ వినోద్, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, యాదయ్య, భారతమ్మ, నర్సింహగౌడ్ ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, మంజుల చంద్రమౌళి, యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు సిద్దిగారిదాస్, మండల వికలాంగుల సంస్థ అధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న రాంరెడ్డి

ఇబ్రహీంపట్నం: కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలను టీపీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఇబ్రహీంపట్నంలో ఓమ్ని ఆస్పత్రి సహకారంతో దండెం రాంరెడ్డి ఆధ్వర్యంలో గత నెల11న ఉచిత వైద్య, కంటి శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వెయ్యి మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకోగా 837 మందికి కళ్లద్దాలు అవసరం పడ్డాయి. ఈ కళ్లద్దాలను ఉచితంగా బాధితులకు ఇబ్రహీంపట్నంలో ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు లిక్కి వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, రమేష్‌గౌడ్, కృష్ణ, క్రిష్ణ, అలీబాయ్, టోనీ పాల్గొన్నారు.

మైనింగ్ పనులను ఆపండి

కమిషనర్‌కు తండావాసుల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాకిబండ తండావాసులు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండతండా సమీపంలోని సర్వే నెం.201లో చేపట్టిన మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయించాలని సాకిబండతాండా రైతులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, కమిషనర్ శ్యాంసుందర్‌ను తండాకు చెందిన రమేశ్‌నాయక్, కళ్యాణ్, రవి రాథోడ్, గోపాల్‌నాయక్, బాలునాయక్ కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. సాకిబండతండా సమీపంలో ఎన్నో ఏళ్లుగా రైతులు పంటలు సాగుచేసుకుని జీవిస్తున్నారని వారు వివరించారు. ఇటీవల మైనింగ్ పనులు ప్రారంభించడంతో తమ పంటలు దెబ్బతినడంతోపాటు బోర్లు పాడవుతున్నాయని వారు ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మైనింగ్‌ను రద్దు చేయించాలని తండావాసులు వినతిపత్రంలో కోరారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన

ఆమనగల్లు: ప్రజలందరికీ తాగునీరు అందించే బాధ్యత మున్సిపాలిటీదేనని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ప్రతిభానగర్‌లో రూ.2 లక్షలతో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ పనులను గురువారం స్థానిక కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్‌తో కలిసి వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఉపాధి పనులకు బడ్జెట్‌లో మొండిచేయి

బడ్జెట్ ప్రతును తగలబెట్టిన కార్మికులు



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

తలకొండపల్లి: రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ఏలాంటి ఉపయోగం లేదని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ చెన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ నిధుల్లో భారీగా కోత విధించారని తెలిపారు. గురువారం మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గాంధీ చౌరస్తాలో కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కొమ్ము చెన్నయ్య, ఇసాక్, ఆనంద్, రత్నయ్య, అంజయ్య, శివయ్య, శ్యామల, నర్సింహ, బాలయ్య, ప్రేమయ్య, సామ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతుల దహనం

యాచారం: ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచేలా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ఉందని గురువారం యాచారం, నందివనపర్తి, మాల్ గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. నరేంద్రమోడీ ప్రభుత్వం బడా వ్యాపారవేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తూ పేద ప్రజలకు తీరని అన్యాయం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య, యాచారం మండల అధ్యక్షుడు శ్రీరాములు, నాయకులు జంగయ్య, ఇందిరమ్మ, అంజయ్య, ఈశ్వరమ్మ, జంగీర్, యాదమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

యువనేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్ రెడ్డి

మంచాల: బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీయ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్ర గురువారం దాద్‌పల్లి, ఎల్లమ్మ తండా గ్రామాల్లో కొనసాగింది. ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దాద్‌పల్లిలో డ్వాక్రా భవన నిర్మాణానికి రూ.10లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో కోతుల బెడద విపరీతంగా ఉందని ప్రజలు తెలపడంతో వెంటనే కోతుల సమస్య పరిష్కారం కోసం రూ.10వేలు అందజేశారు. గ్రామంలో వీధి దీపాలు సక్రమంగా లేవని ప్రజలు పేర్కొన్నడంతో 50 వీధి దీపాలు అందజేస్తామన్నారు. క్రీడాకారులకు క్రికెట్, వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, మంచాల ఎంపీపీ నర్మద, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్, ప్రధాన కార్యదర్శి బహదూర్, ఎంపీటీసీలు అనిత, సుకన్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీ పాష, జిల్లా నాయకులు సికిందర్‌రెడ్డి, రవి, జంగారెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షు రాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తలకొండపల్లి: హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన సుగుణమ్మ (51).. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గతనెల 26న పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సుగుణమ్మ మృతిచెందింది. గురువారం మృతురాలి సోదరుడు కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దరాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్‌యాదవ్ తెలిపారు.

వీఆర్‌ఏల మౌన దీక్ష

తుర్కయంజాల్: వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట వీఆర్‌ఏలు మౌన దీక్ష చేపట్టారు. పేస్కేలు అమలుచేయాలని, 50 ఏళ్ల పైబడిన వారందరి వారసులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ హరీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మన్ ఎడ్ల వెంకటేష్, సెక్రటరీ జనరల్ నరసింహ, కన్వీనర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు బ్రూసెల్లా టీకాల పంపిణీ

మంచాల: పాడిరైతులు తమ పశువులకు వ్యాధి నిరోధక టీకాలు(బ్రూసెల్లా) తప్పక వేయించాలని పశువర్ధకశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ పి.కృష్ణయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మంచాల పశువైద్యశాల వైద్యురాలు సుదారెడ్డి, సిబ్బంది రాంచందర్, శ్రీశైలం, శివరాజ్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన

ఆమనగల్లు: పోలెపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పోలెపల్లి ఎంపీటీసీ సభ్యుడు, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దోనాదుల కుమార్ చెప్పారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. నాయకులు నర్సిరెడ్డి, వెంకటయ్య, లాలయ్య, నవీన్, మహేశ్, వెంకటేశ్, రామకృష్ణ, పవన్, రాజు, గోపాల్ పాల్గొన్నారు.

అద్దె భవనంలోకి అంగన్‌వాడీ

సమస్య పరిష్కరించిన జెడ్పీటీసీ



అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: మండల పరిధిలోని గడ్డమీదితండాలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీలు ఒకే భవనంలో నిర్వహిస్తున్నారని దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామ సర్పంచ్ పాండునాయక్ బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యపై స్పందించిన జెడ్పీటీసీ దశరథ్ నాయక్, సంబంధిత అధికారులతో కలిసి గురువారం గడ్డమీదితండాకు చేరుకుని అంగన్‌వాడీ, పాఠశాల వేరువేరుగా నిర్వహించాలని.. అంగన్‌వాడీని అద్దె భవనంలోకి మార్చాలని సూచించారు. అంగన్‌వాడీ భవన నిర్వహణకయ్యే అద్దెను రాథాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తాను చెల్లిస్తానని హామీ ఇచ్చారు. దీంతో సమస్య పరిష్కారం కావడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఐసీడీఎస్ సీడీపీఓ సక్కుబాయి, సర్పంచ్ పాండునాయక్, ఉపాధ్యాయుడు లక్ష్మణ్, ఉపసర్పంచ్ రమణ, వార్డు సభ్యులు సోమ్లా తదితరులు ఉన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: నిరుపేదల ఇంటి నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూత నందిస్తున్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సుమారుగా 500 మంది నిరుపేదల ఇండ్లను ఉప్పల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. గురువారం మండలంలోని ఖానాపూర్‌కు చెందిన యాదయ్య ఇంటి నిర్మాణం కోసం ట్రస్టు సభ్యులు సిమెంట్, స్టీల్, ఇసుక, ఇటుక తదితర సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ యాదయ్యగౌడ్, పాండు, శివాజీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామానికి చెందిన మహమూదాబేగం అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గురువారం మధ్యాహ్నం బాధిత కుటుంబ సభ్యులకు ట్రస్టు తరఫున రూ.5వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికుమార్, శేఖర్, రాంచంద్రయ్య, తిరుపతినాయక్, రాజు, రమేశ్, కృష్ణయ్య, సందీప్, అంతయ్య, శేఖర్ తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న భక్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని గేటుతండాలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వాహకులు ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం, అర్చనలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. రాంనుంతల సర్పంచ్ సోన శ్రీనునాయక్, కోనాపూర్ ఎంపీటీసీ సరిత పంతునాయక్, మాజీ సర్పంచ్ ఆనంద్‌నాయక్, విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు పత్యానాయక్, పోలెపల్లి ఎంపీటీసీ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

కడ్తాల్: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాంచందర్‌నాయక్, చెన్నకిషన్‌రెడ్డి, రాములుయాదవ్, నరేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బొక్కల కంపెనీని మూసేయండి

కొత్తపల్లి గ్రామస్తుల ధర్నా



కంపెనీ ఎదుట దర్నా చేస్తున్న గ్రామస్తులు

యాచారం: కొత్తపల్లి-తక్కళ్లపల్లి గ్రామాల మధ్యలో ఉన్న బొక్కల కంపెనీని మూసేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు గురువారం కంపెనీ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. గ్రామ సర్పంచ్ ఎండీ హబీబుద్దీన్, ఉప సర్పంచ్ కావలి జగన్, తెలంగాణ మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చిక్కుడు గుండాలు, కొత్తపల్లి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో కంపెనీని ఎదుట ధర్నా నిర్వహించారు. కంపెనీ వల్ల దుర్వాసన వచ్చి రోగాల బారినపడి ఆస్పత్రుల పాలవుతున్నామని అన్నారు. ఏళ్లుగా ఆందోళన చేస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వెంటనే కంపెనీని మూసేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కొనసాగుతున్న కంటి వెలుగు

ఆమనగల్లు: మండలంలో కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. మంగళపల్లిలోని చెన్నకేశవ కాలనీలో గురువారం 102 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, సర్పంచ్ నర్సింహారెడ్డి, డాక్టర్లు పరిక్షిత్ నరేందర్, మంజులాదేవి, సిబ్బంది తిరుపతిరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

తలకొండపల్లి: కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని వెల్జాల్‌లో ఆయన జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ముజీబుర్ రహ్మాన్‌తో కలసి కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారభించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మల్లికార్జున్, డాక్టర్ శివ, హెచ్‌ఏ మల్లయ్య, డీఈఓ సరిత, ఏఎన్ఎంలు సుజాత, సువర్ణ, దస్తగిరి, రవి, సరేందర్‌గౌడ్, శ్రీను, రాజు, కిరణ్, కార్యదర్శి శరత్, శ్రీరాం, హెచ్‌ఈఓ రవి కుమార్, రామచంద్రయ్య, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఆమనగల్లు వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామంలో గురువారం రూ.20లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు సర్పంచ్ కొప్పు మంజుల, వార్డు సభ్యులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేశ్‌గౌడ్, ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్, ఎంపీఓ శ్రీలత, ఏఈ కృష్ణయ్య, నాయకులు కొప్పు యాదయ్య, సురేందర్‌రెడ్డి, అశోక్, లక్ష్మారెడ్డి, ప్రకాశ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేలుడు పదార్థాలు తిని ఆవుకు గాయాలు

కడ్తాల్: అడవిపందుల వేట కోసం గుర్తుతెలియని వ్యక్తులు పెట్టిన పూస (పేలుడు పదార్థం) తినడంతో పాడిఆవు తీవ్రంగా గాయపడిన సంఘటన మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామ సమీపంలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కడ్తాల్ పరిసర గ్రామాలకు చెందిన గుర్తుతెలియని వ్యక్తులు మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామ సమీపంలోని వ్యవసాయపొలాల్లో అడవిపందుల వేటకోసం పూసలు పెట్టారు. గురువారం మధ్యాహ్నం చల్లంపల్లి గ్రామానికి చెందిన గడ్డం పర్వతాలు తన పాడి పశువులను మేత మేపడానికి పొలానికి తీసుకువెళ్లగా అందులో ఒక ఆవు మేత మేస్తూ ప్రమాదవశాత్తు పూసను తినడంతో.. ఆవు దవడ పగిలి గాయాలయ్యాయి. స్థానిక పోలీసులకు సమాచారం అందించినట్లు బాధిత రైతు పర్వతాలు తెలిపారు.